క్లుప్తంగా

జిల్లా సైన్స్ ఫెయిర్‌కు ముస్తాబు



కొవ్వలిలోని ఉన్నత పాఠశాల

దెందులూరు: జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక సదస్సుకు కొవ్వలి ఉన్నత పాఠశాల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, ఎస్పీ,ఉన్నత ప్రజాప్రతినిధులు అతిథులుగా విచ్చేస్తున్న నేపథ్యంలో ఉన్నత పాఠశాల జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు జీ.శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమిష్టిగా ఏర్పాట్లు చేశారు.

క్యారేజీ బ్యాగుల పంపిణీ



క్యారేజీ బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: యూటీఎఫ్ ఉంగుటూరు మండలం శాఖ ఆధ్వర్యంలో 300 క్యారేజీ బ్యాగులను ఉపాధ్యాయులకు, విద్యా శాఖ కార్యాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వీటిని పీవీ అప్పారావు, సునీల్, బేబి సరోజిని, తోట మూర్తిరాజుల వితరణతో శుక్రవారం పంపిణీ చేశారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బైక్ ర్యాలీ



పందిరెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: విజయవాడలో ఈ నెల 5న నిర్వహించే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. గోపాలపురం, పందిరెడ్డిగూడెం, రామచంద్రపురం, నల్లమాడు, ఎర్రమిల్లిపాడు, కంసాలిగుంట, కొత్తగూడెం, గోపినాథపట్నం కాలనీ, గొల్లగూడెం గ్రామాల్లో ర్యాలీ కొనసాగింది. యువకులు పాల్గొన్నారు.

అత్యవసర పనులపై నివేదిక ఇవ్వండి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: ప్రజల అత్యవసరాన్ని గుర్తించి, సంబంధిత పనులపై నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశించారు. శుక్రవారం ఉంగుటూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ అధికార్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వాటర్ గ్రిడ్ స్కీం ద్వారా నియోజకవర్గానికి రక్షిత తాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా అయ్యేందుకు కొంతకాలం పట్టే అవకాశం ఉందని అన్నారు. కొత్త పాత లేఅవుట్లలో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ఎమ్మెల్యేకి అందజేశారు. హౌసింగ్ లే అవుట్లలో త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునే లా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ధర్మరాజు ఆదేశించారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలిని

ఏలూరు (టూటౌన్): ఆసుపత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర చాలా కీలకమని, వారు చేసే పరీక్షల ద్వారా రోగి ఏ వ్యాధితో బాధపడుతున్నాడో గుర్తించగలమని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలిని అన్నారు. స్థానిక ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి ల్యాబ్ టెక్నీషియన్‌ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ల్యాబ్ టెక్నీషియన్లు అంకితభావంతో పనిచేసి ప్రాథమిక ఆరోగ్యంద్రాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎక్కువ రక్త, మూత్ర పరీక్ష చేసి జిల్లా గ్రేడింగ్‌ను పెంచాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు రోగులను భయపెట్టకుండా ధైర్యపరచాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ నిర్మూలనలో ల్యాబ్ టెక్నీషియన్ పాత్ర కీలకమన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, హెల్త్ సూపర్వైజర్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

మల్చింగ్ సాగుపై మొగ్గు

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు
- దెందులూరు నియోజకవర్గంలో 100 ఎకరాల్లో వివిధ పంటల సాగు



చల్లచింతలపూడి పొలాల్లో మల్చింగ్ సాగు

దెందులూరు: నూతన సాగు విధానాలకు ప్రాధాన్యత ఇచ్చే దెందులూరు నియోజకవర్గం రైతాంగం సేంద్రియ వ్యవసాయంలో అద్భుతాలు సాధిస్తున్నారు. పంటల్లో మల్చింగ్ సాగు విధానాన్ని అవలంబిస్తున్నారు. ఈ సాగును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రైతుల శ్రేయస్సు దృష్ట్యా 50 శాతం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించింది. సాగు ఖర్చు తగ్గి, అధిక దిగుబడులు రావడంతో నియోజకవర్గంలో పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో పుచ్చ, మిరప, అరటి, బొప్పాయి తోటలు దాదాపు 100 ఎకరాల్లో మల్చింగ్ సాగు విధానాన్ని రైతులు అమలు చేస్తున్నారు. ఈ సాగు విధానానికి ఎకరానికి రైతుకు రూ.18 వేలు ఖర్చువుతుంది. ఎకరానికి ప్రభుత్వం రూ.4 వేలు సబ్సిడీ అందిస్తుంది. పుచ్చ, మిరప, అరటి, బొప్పాయి, బంతి, వంగ, మిర్చి తోటల్లో మల్చింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా అనేక గ్రామాల్లో మల్చింగ్ సాగు విధానానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. క్షేత్ర స్థాయిలో హార్టికల్చర్ అధికారులు రైతులను కలిసి పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

నాటు విధానం

మల్చింగ్ షీట్ వేసిన తరువాత మొక్కను 5-10 సెంటీమీటర్ల లోతుల్లో పెట్టాలి. మొక్కకి... మొక్కకి మధ్య ఒక మీటరు దూరం ఉండాలి.ఒక ఎకరానికి 7, 8 షీట్లు ఏర్పాటు చేయాలి. కావాల్సిన సైజ్‌లో మల్చింగ్ షీట్‌ను కత్తిరించుకోవాలి. దీన్ని ప్రతి వరుస మీద బిగుతుగా ఇరువైపులా నాగలి సాలు లోతు పోయేలా ఏర్పాటు చేసుకుని మట్టితో అంచులను కప్పి వేయాలి. షీటును మరీ బలంగా లాగకూడదు.

షీట్లు ఎంపిక

పొలం పరిస్థితి, పంటను బట్టి మందం, పలచన షీట్లు ఎంచుకోవాలి. ఒక మందం షీటు అయితే రూ.2 వేలు నుంచి రూ.2300 వరకు ధర ఉంటుంది. పలచన షీటు ఒకటి రూ.1400 నుంచి రూ.1600 వరకు ఉంటుంది.



చల్లచింతలపూడిలో మల్చింగ్ సాగును పరిశీలిస్తున్న అధికారులు

ఉపయోగాలు

- కలుపు నివారించవచ్చు
- మొక్కలకు తేమ శాతం ఎక్కువగా లభిస్తుంది
- చీడలు, పీడలు ఉండవు

మల్చింగ్ అంటే

మొక్కల చుట్టూ వేర్లు దగ్గర మట్టిని ఏదైనా పదార్థంతో కప్పి పెట్టడాన్ని మల్చింగ్ అంటారు. ఎండుగడ్డి, ఎండిన ఆకులు, ఊక, వరి, రంపపు పొట్టును ఉపయోగించి సహజ సిద్ధమైన విధానంతో కూడా మల్చింగ్ చేస్తారు. కృత్రిమంగా తయారు చేసే ప్లాస్టిక్ షీట్‌తోనే ప్రస్తుతం రైతులు మల్చింగ్ చేస్తున్నారు.

50 శాతం రాయితీ



మల్చింగ్ విధానం వల్ల పంటలో కలుపు రాదు. భూమిలో తేమ నిలబడుతుంది. రసం పీల్చే పురుగులు ఉధృతి తగ్గుతుంది. రైతులకు స్ప్రే చేసే విధానంలో ఖర్చు తగ్గుతుంది. 50 శాతం రాయితీ గత ఐదేళ్లుగా అమలవుతోంది. దీర్ఘకాలిక పంటలతో పాటు అంతర పంటల సాగు సైతం నియోజకవర్గంలో అధికంగా ఉంది. ప్రస్తుతం అంతర పంటల వినియోగంలో మల్చింగ్ విధానం అధికంగా అమలు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న రైతులు ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి.

– రామ్మోహన్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్

సత్ఫలితాలు



పుచ్చ, మిరప తోటల సాగు చేస్తున్నాను. మల్చింగ్ విధానం అమలు వల్ల కలుపు రావటం లేదు. దీంతో సంతృప్తిగా ఉంది. హార్టికల్చర్ ఉద్యోగులు ఇస్తున్న సూచనలు సలహాలను పాటిస్తున్నాను.

– రాజబోయిన రమేష్, రైతు రామారావుగూడెం

సబ్సిడీని పెంచాలి

పంటల్లో మల్చింగ్ సాగు విధానానికి ఎకరానికి రూ.16 వేలు ఖర్చువుతుంది. సబ్సిడీ 50 శాతం కంటే అదనంగా పెంచితే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సన్న, చిన్నకారు రైతులకు మరికొంత ప్రయోజనం కలుగుతుంది.

– యుగంధర్, రైతు, చల్ల చింతలపూడి

నూరుశాతం ఫలితాలు సాధించాలి

పెదపాడు : విద్యార్థులు విజయకేతనం పుస్తకాలను వినియోగించుకుని నూరుశాతం ఫలితాలు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ టెన్త్ విద్యార్థులకు సూచించారు. పెదపాడు మండలం పెదపాడు, సత్యవోలు, కొత్తూరు గ్రామాల్లో 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఉపయోగపడే మెటీరియల్‌ను ఆమె అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఘంటా ప్రసాదరావు, కార్పొరేటర్ సాంబ, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ, హెచ్‌ఎం పి.కటేశ్వరరావు, రాధ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉంగుటూరు: మండలంలోని వెల్లమిల్లి, బాదంపూడి, చేబ్రోలు గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీఓ రాజ్‌మనోజులు శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చేబ్రోలులో ఎంపీటీసీ సభ్యులు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, వెల్లమిల్లిలో సర్పంచ్ కుమార్ రాజ, బాదంపూడిలో కార్యదర్శి గిరిధర్ పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో సౌకర్యాలపై ఆరా

ఏలూరు (టూటౌన్): స్థానిక ప్రభుత్వ ప్రజా వైద్యశాల ప్రాంగణంలోని వన్ స్టాప్ సెంటర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం సందర్శించారు. వన్‌స్టాప్ సెంటర్లో బాధితులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు, సంస్థ నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేశారు. బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అవసరమైతే న్యాయ సేవాధికార సంస్థలు అందించే ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలని సూచించారు.

మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదే



వాసుబాబును సత్కరించిన కందులపాటి శ్రీను, పాతూర్తి శ్రీనివాసరాజు



వాసుబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కరణం బుజ్జి, నల్లమాడు రవి



వాసుబాబును సత్కరిస్తున్న ఇంజేటి నీలిమ జూనియర్

మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: అబద్ధాలతో ప్రజలను నమ్మించి అధికార పీఠమెక్కిన కూటమి ప్రభుత్వంపై ఆరునెలల్లోనే ప్రజల భ్రమలు పూర్తిగా తొలగిపోయాయని, మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీదేనని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఆయనను వైఎస్సార్ సీపీలో జిల్లా పదవుల్లో నియమితులైన నియోజకవర్గానికి చెందిన నాయకులు ఆయన్ని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వాసుబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. తమపై నమ్మకంతో వివిధ పదవుల్లో నియమించినందుకు వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చే ఉద్దేశంలో కూటమి పాలకులకు లేరని, అందుకే రోజుకోరకం డైవర్షన్ పాలిటిక్స్‌తో పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పాలనకు, కూటమి పాలనకు తేడాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు. వాసుబాబును కలిసిన వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కందులపాటి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పాతూర్తి శ్రీనివాసరాజు, జిల్లా కార్యదర్శులుగా కరణం బుజ్జి, నల్లమాడు రవికుమార్, సెక్రటరీ యాక్టివిటీగా పాతంశెట్టి శ్రీను, బండి ఇస్సాకు, జిల్లా అధికార ప్రతినిధిగా భీమడోలు ఏఎంసీ చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ ఉన్నారు.

వాసుబాబును కలిసిన నీలిమ

భీమడోలు: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పూళ్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు కందులపాటి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధిగా భీమడోలు ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంజేటి నీలిమ జూనియర్ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వాసుబాబుకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ముళ్లగిరి జాన్సన్, గంటా శ్రీనివాసరావు, నాయకులు బొల్లారపు పవన్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శులుగా బుజ్జి, రవి

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఉంగుటూరు మండలం చేబ్రోలు మాజీ సర్పంచ్ కరణం వెంకట రామారావు (బుజ్జి), నల్లమాడుకు చెందిన కండేపు రవీంద్ర కుమార్ (రవి) నియమితులయ్యారు. వీరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవి, బుజ్జిలకు పలువురు అభినందనలు తెలిపారు.

బౌలర్ ఆఫ్ ది టోర్నీ మోహన్‌బాబుకు సన్మానం



మోహన్‌బాబు దంపతులను సత్కరిస్తున్న డీఎస్పీ, తదితరులు

పెదవేగి : అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన ఎల్ఎంఎస్ వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్ జట్టు తరఫున పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన చేసి బౌలర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన తెలుగు తేజం బలుసు మోహన్‌బాబు నేటి యువతకు ఆదర్శమని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అన్నారు. పెదవేగి మండలం ముండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి బలుసు మోహన్‌బాబును శుక్రవారం ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామం నుంచి దేశ ఖ్యాతిని చాటేలా ఎల్ఎంఎస్ వరల్డ్ కప్ క్రికెట్ టోర్నీలో రాణించి, ఉత్తమ ప్రతిభ కనపరచడం గర్వకారణమని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ సందదర్భంగా మోహన్‌బాబు దంపతులను ఘనంగా సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, విశ్రాంత ఉపాధ్యాయులు ఇ.సాంబశివరావు, ఎస్ బలరామయ్య, ఏడీవీ ప్రసాద్, పూర్వ విద్యార్థుల పాల్గొన్నారు.

వరి దుబ్బులకు సల్ఫైడ్ గాయం



ఎ.గోకవరం ఆయకట్టులో వరిని పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త ఫణికుమార్

ఉంగుటూరు: దాళ్వాలో వరి నారు నాటిన 15 నుంచి 20 రోజుల్లో నాట్లు కుళ్లిపోవడాన్ని గుర్తించామని, దీన్ని సల్ఫైడ్ గాయం అని కూడా అంటారని ఏలూరు ఏరువాక శాస్త్రవేత్త కె.ఫణికుమార్ తెలిపారు. ఉంగుటూరు మండలం ఎ.గోకవరంలో కుళ్లిపోతున్న వరి దుబ్బులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తెగులు నివారణకు చేలను ఆరబెట్టాలని, వెంట్రుకవాసి నెరలు ఏర్పడేదకా నీరు పెట్టకూడదని సూచించారు. గంధకం కలిగిన ఎరువులు 20-20-0-13 లేదా 28-28-0 లాంటి ఎరువులను వాడొదన్నారు. దాళ్వా మెదటి దమ్ముకు, చివరి దమ్ముకు 10 నుంచి 15 రోజులు వ్యవది ఉండాలన్నారు. జింకు సల్ఫేటు 20 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే జింకు లోపాన్ని నివారించవచ్చని చెప్పారు. క్లోరాంట్రినిల్ ప్రోల్ 60 మి.లీ. ఎపీసేట్ 300 గ్రాములు లేదా కోరోపైరీపాస్ 500 మి.లీ. ఎకరానికి పిచికారీ చేస్తే ఆకు ముడుత, కొండం తొలుచు పురుగులను అరికట్టవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్ఎస్ ప్రవీన్‌కుమార్, వీఏఏలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

మన్మోహన్ సేవలు అమోఘం



మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశం

భీమడోలు: దేశార్థికాభివృద్ధిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాత్ర ఆమోఘమని, ఆయన సేవలు మరవలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు అన్నారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సంతాప దినాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించి కార్యక్రమంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధి హామీ పథకం, ఆధార్ కార్డు, ఆర్‌టీఈ యాక్ట్ వంటి విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఆర్థిక సంస్కర్త అని, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు అన్నం పెట్టిన మహోన్నత వ్యక్తి అని రాజనాల కొనియాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ ఇంజేటి విజయ్ అచ్యుతం తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నిడమర్రు: బైనేపల్లి గ్రామ శివారులో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు

ద్వారకాతిరుమల: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా, పశుగణాభివృద్ధి సంస్థ (పెంటపాడు) ఆధ్వర్యంలో మండలంలోని ఎం.నాగులపల్లిలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామంలోని మినీ గోకులాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు 54 పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించారు. అలాగే 45 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, పాడి పశువులకు లివర్ టానిక్, మినరల్ మిక్చర్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ టి.గోవిందరాజు, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ జేసురత్నం, భీమడోలు ఏడీ డాక్టర్ సాయి రమేష్, డాక్టర్ క్రాంతి కిరణ్, ద్వారకాతిరుమల మండల పశు వైద్యాధికారి అంగర సురేష్, డాక్టర్ రమేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న సర్పంచ్ రహీమాబేగం, ఎంపీటీసీ దేవి

భీమడోలు: అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నీ పరిష్కరించడమే గ్రామ సభ లక్ష్యమని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అన్నారు. పోలసానిపల్లిలో శుక్రవారం ఏర్పాటుచేసిన గ్రామ సభకు ఆమె అధ్యక్షత వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు, పెద్దలు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి దేవి, కార్యదర్శి జయరామకృష్ణ, వార్డు సభ్యులు నానాది రాజారత్నం, ఆతకోట అనంతమ్మ, నీటి సంఘం అధ్యక్షుడు వీరవల్లి ఏడుకొండలు, పెద్దలు మద్దు శ్రీనుబాబు, యర్రంశెట్టి సతీష్, వి.గోవింద్ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. 8వ వార్డులోని పొల్ట్రీ కాంప్లెక్స్ ఏరియాలోని మంచి నీటి బోరు వద్ద తూరలు ఏర్పాటు చేశారు. సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని సర్పంచ్‌ను జేజేపీ నాయకులు ప్రవీణ్‌కుమార్ పటేల్, పాకిన సత్యనారాయణలు సత్కరించారు.

సావిత్రిబాయి జీవితం ఆదర్శనీయం



ఉంగుటూరు : ఉపాధ్యాయులను సత్కరించిన ఎంపీటీసీ బాలకృష్ణ



గణపవరం : వాకపల్లిలో మహిళా ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న సిబ్బంది

ఉంగుటూరు: సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఉంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఉంగుటూరు నెం.1 పాఠశాలలో ఆమె చిత్రపటానికి బాలకృష్ణ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. హెచ్‌ఎం ఎం సిరిమామిళ్ల పెద్దిరాజు అధ్యక్షతన ఉపాధ్యాయులు పి.దుర్గామల్లేశ్వరి, ఎం ప్రశాంతి, టి.సుబాషిణిలను బాలకృష్ణ సత్కరించారు.

- కైకరం కొత్తూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేజయంతి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

గోపన్నపాలెం స్కూల్‌లో..

దెందులూరు: సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయులందరికీ ఆదర్శప్రాయురాలని గోపన్నపాలెం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వహకులు ఉన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

గణపవరం: మహిళా విద్య కోసం నిరంతరం శ్రమించిన సావిత్రి బాయిపూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శప్రాయమని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆమె జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి మాట్లాడారు. గణపవరం బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను సన్మానించారు. జల్లికొమ్మర ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. వాకపల్లి యూపీ పాఠశాలలో ఉపాధ్యాయినులను సన్మానించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

భీమడోలు: పాతూరు, అన్నేవారిగూడెం యూపీ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె చిత్ర పటాల వద్ద హెచ్‌ఎంలు పి.నిర్మలకుమారి, షేక్ మస్తాన్‌ల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. అన్నేవారిగూడెం పాఠశాలలో డ్రాయింగ్ పోటీల్లో విజేతలు చిన్నం ప్రేమామృత, దాసరి లక్ష్మీ దీపికలకు బహుమతులను అందించారు. టీచర్లు మండే సుధాకర్, స్వర్ణలత, విజయకుమారి, దుర్గాప్రసాదిని, రవి భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

పెదపాడు : వట్లూరులోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ దాసరి మేరి ఝాన్సీరాణి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు పిరమిడ్ ట్రస్టు శిక్షణ

జంగారెడ్డిగూడెం: స్థానిక పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 5న జీవితలక్ష్యం అనే అంశంపై ఒకరోజు శిక్షణను ఏర్పాటుచేసినట్టు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.